


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఆదిలాబాద్
మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

ఆదివారం 01 జూన్ 2025 పేజీలు 05


### ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

# అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు

**○ రైతులకు,విత్తనాలు,ఎరువుల కొరత లేకుండా చూడాలి ○ నకిలి విత్తనాల నియంత్రణకు పకడ్బందిగా చర్యలు ఉండాలి ○ భూ భారతిలో భూముల సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలి ○ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా సంక్షేమ శాఖ మంత్రి కలిసిరి అవమాయ (సీతక్క )**



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హతగల ప్రతి ఒక్కరికి అందేలా అధికార యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా




నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీం అసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా. అభిలాష అభినవ్, సమగ్ర గిరి అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, దండే విఠల్, మంచిర్యాల, బెల్లంపల్లి, ముధోల్ నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, జి.సి.సి. చైర్మన్ కొన్నాక తిరుపతిలతో కలిసి ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాలల అధికారులతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగితా.. 2లో

## నిరుపేదల కోసం "మహా ప్రస్థానం"

### - రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

**మంచిర్యాల బ్యూరో, 31 మే, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం (వైకుంఠధామం) నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ



మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల మహాప్రస్థానం ను మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో నిర్మించిన మహాప్రస్థానం రాష్ట్రంలోనే అత్యున్నతంగా ఉందని, ప్రజల కొరకు నిర్మించిన మహాప్రస్థానంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మావోయిస్ట్ లతో కేంద్రప్రభుత్వం

# శాంతి చర్చలు జరపాలి

### - కగార్ ఆపరేషన్ పేరుతో జరిపిన ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి
### - మావోయిస్ట్ పార్టీ మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ ద్వితీయ వర్ధంతి సభలో వక్తలు

**బెల్లంపల్లి, మే 31, సూర్య మేజర్ న్యూస్:**

మావోయిస్ట్ పార్టీతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నరమేదాన్ని నిలిపి వేయాలని ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు.




శనివారం బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తిలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కటకం సతీష్ నివాసంలో నిర్వహించిన మావోయిస్ట్ పార్టీ కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు కటకం సుదర్శన్ ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. అంతకుముందు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్‌లు కటకం సుదర్శన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత జరిగిన కటకం సుదర్శన్ రెండవ వర్ధంతి సభలో పాల్గొన్న సామాజిక కార్య కర్త మహ్మద్ హుస్సేన్, తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదన కుమార స్వామి, (మిగితా..3 లో )

### నిరుద్యోగ యువతకు ఉపాధి

# కల్పించడమే లక్ష్యం

### - రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్:**

రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల పట్టణంలో ఎఫ్ సి ఏ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జాబ్ మేళాలో మంచిర్యాల జిల్లా నుండి 200 మందికి పైగా డిగ్రీ,ఇంటర్మీడియట్ చదువుకున్న యువతీ,యువకులు పాలుగోన్నారు.ఈ జాబ్ మేళాలో హైదరాబాద్ కు చెందిన ఎం ఎస్ ఎన్ ఫార్మా,ఐ టీ సి,న్యూ ల్యాండ్ సంస్థల సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు.మంచిర్యాల జిల్లాలో నిరుద్యోగ



యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని రఘునాథ్ వెరబెల్లి కోరారు.రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగునూరి వెంకటేశ్వర్ గౌడ్,పెద్దపల్లి పురుషోత్తం,కృష్ణ మూర్తి,జోగుల శ్రీదేవి,అమిరిశెట్టి రాజ్ కుమార్,హరి కృష్ణ,బింగి సత్యనారాయణ, శ్రీనివాస్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### వార్షిక ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచిన అధికారుల కృషి అభినందనీయం

### - రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



2 లో

### పదవి విరమణ అనంతరం

# ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉండాలి

### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

3 లో



సూర్య www.suryaa.com

ఆదివారం 01 జూన్ 2025

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు



**- రైతులకు,విత్తనాలు,ఎరువుల కొరత లేకుండా చూడాలి - నకిలి విత్తనాల నియంత్రణకు పకడ్బందిగా చర్యలు ఉండాలి - భూ భారతిలో భూముల సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలి- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొమగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం - 2025లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 జిల్లాలలోని 4మండ లాలలో ముందు పైలెట్ ప్రాజెక్టు కింది తీసుకున్న సంబంధిత సమస్యలను జూన్ 2వ తేదీలోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడతలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. రైతులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా ఎలాంటి వివాదాలు లేకుండా భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అత్యంత పేదవారికి జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.వి.డి.జి.లు, ఇతర ఆదివాసీలకు 2వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్-2025 సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, వైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అధిక ధరలకు విక్రయిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై, నకిలీ / నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్య నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని, నీటిపారుదల, వైద్య-ఆరోగ్య వ్యవసాయ శాఖలు, సంబంధిత శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని చేపట్టిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి కౌమార దశ పిల్లల కొరకు పౌష్టిగాహారం కొరకు చిక్కీలను ఇవ్వడం జరుగుతుందని,అంగన్వాడీ టీచర్లకు 2 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేసవి సెలవులు ఇవ్వడం జరుగుతుందని, జీతాల పెంపుదల అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని, 25 వేల 700 అంగన్వాడీ కేంద్రాలను ప్రీ-ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, 50 రకాల ఆట వస్తువులు అందించడం జరిగిందని, టీచర్లు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు.

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీవన్ మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీన ప్రభుత్వం



ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025లో భాగంగా పైలెట్ మండలంగా జిల్లాలోని భీమారం మండలం ఎంపిక చేయడం జరిగిందని, ఈ క్రమంలో భీమారం మండలంలోని 12 గ్రామపంచాయతీలలో 26 మంది సిబ్బందితో బృందాలను నియమించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఒక ప్రత్యేక సర్వే బృందంతో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2 వేల 14దరఖాస్తులలో వేయి 10 సాదాదైనమాపై అందాయని, న్యాయస్థానంలో కేసులు కోనసాగుతున్నందున తీర్పు అనంతరం పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన వేయి 136 దరఖాస్తులలో 741 పరిష్కరించడం జరిగిందని, మిగిలిన వాటిని జూన్ 6వ తేదీ లోగా పరిష్కరిస్తామని తెలిపారు. మిగిలిక మండలాలలో జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు మండలానికి 2 బృందాల చొప్పున ఏర్పాటు చేసి దరఖాస్తులు. స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో 2 వేల ఇండ్లు మంజూరు కాగా 991 ఇండ్లు గ్రౌండ్ లెవల్ ప్రక్రియ పూర్తి అయ్యాయని, నిర్మాణ దశము బట్టి బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం ఈ సమయానికి 1 లక్షా 35 వేల మెట్రిక్ టన్నుల పరిధాన్యం కొనుగోలు చేయగా ఈసారి 77 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. గతంలో పోల్చితే ఈసారి 1.5 /2 రెట్లు అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో నకిలీ /విషేత విత్తనాలు, ఎరువుల రవాణా, విక్రయంపై చర్యలు చేపట్టామని, ఇప్పటి వరకు 34 మందిని అరెస్టు చేసి 071 కిలోల నకిలీ /నిషేవిత విత్తనాలను స్వాధీనపర్చుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా సరిహద్దులో అంతర్గత చెక పోస్టులను ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించడం ఇరుగుతుందని తెలిపారు.అనంతరం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కలోన బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం క్రింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సజావత్ మోతిలాల్ జిల్లా అటవీ అధికారి జీన్ అజీష్ సింగ్ పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల మధ్య నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.



జూన్ 2వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలోని పెంచికల్‌పేట మండలం మినహాయించి మిగిలిన 14మండలాలలో రెవెన్యూసదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ద్దరఖాస్తులు స్వీకరించి పరిష్కారం దిశగా రెవెన్యూ యంత్రాంగాన్ని సిద్ధం చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన వారికి పంపిణీ చేయడం జరిగిందని, మొదటి విడతలో 1 వేయి 669 ఇండ్లు, 2వ విడతలో 4వేల100 ఇండ్ల కొరకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. వర్షాకాలంలో ఖరీఫ్ సాగుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ రవాణా జరగకుండా జిల్లాలో 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఫర్టిలైజర్ దుకాణాలను నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లాలోని కిశోర బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం కింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వార్షిక ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచిన అధికారుల కృషి అభినందనీయం

**- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**

ఆదిలాబాద్ ప్రతినిధి,మే 31, సూర్య మేజర్ న్యూస్ :

10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో ఉంచడంలో అధికారుల కృషి



అభినందనీయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భాగంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష



ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాను ముందు వరుసలో ఉంచినందుకు, జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేసినందుకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లను రాష్ట్ర మంత్రి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. మున్ముందు జిల్లాలో విద్యారంగ వ్యవస్థను మరింత బలోపేతం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మల్క కొమురయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశం కొరకు**

## దరఖాస్తుల స్వీకరణ

**- జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి**

**మంచిర్యాల, 31 మే, సూర్య మేజర్ న్యూస్ :** 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద 1, 5 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1వ తరగతికి (నాన్ రెసిడెన్షియల్-91 సీట్లు), 5వ తరగతికి (రెసిడెన్షియల్-92) సీట్లు కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జూన్ 3వ తేదీ నుండి 16వ తేదీ సాయంత్రం 5 గం౹౹ల లోపుగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో లభిస్తాయని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమ ఈ పథకం వరిస్తుందని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జనన ధృవీకరణ పత్రం (1వ తరగతి అభ్యర్థులు జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉ ండాలి), మీ-సేవ ద్వారా జారీ చేయబడిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, పాఠశాల నుండి గత సంవత్సరం మార్కుల జాబితా నకలు ప్రతులు (5వ తరగతి అభ్యర్థులకు), అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ సంతకం చేయించాలని తెలిపారు. అభ్యర్థులు గడువులోగా దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులము అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలని, ఆసక్తి, అర్హత గల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మావోయిస్ట్ లతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి - కగార్ ఆపరేషన్ పేరుతో జరిపిన ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి

మొదటి పేజీ తరువాయి...

అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర కార్య దర్శి శాంతక్క, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు టీ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బెల్లంపల్లిలో సింగరేణి కార్మికుడు కటకం మల్లయ్య కుటుంబంలో పుట్టిన కటకం సుదర్శన్ నాటి పీపుల్స్ వార్, గ్రూప్, సికాస లో పనిచేస్తూ అనేక కార్మిక ఉద్యమాలు నిర్వహించి మావోయిస్ట్ పార్టీలో కేంద్రకమిటీ పొలిట్ బ్యూరో సభ్యునిగా ఎదిగాడన్నారు. దేశం లో నడుస్తున్న జెనతన్ సర్కార్ ఏర్పాటులో ముక్య భూమిక పోషించాడన్నారు. సుదర్శన్ మధ్య భారత దేశంలో ఆదివాసీ గిరిజనులను ఐక్యం చేసి అనేక పోరాటాలు నిర్వహించి పేద ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో నీ దండకారణ్యంలో ఉన్న లక్షల కోట్ల రూపాయల విలువ గల అపార ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, విదేశీ బహుళ జాతి కంపెనీలకు ధారా దత్తం చేసేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాలు అడవుల్లో జీవిస్తున్న ఆదివాసి గిరిజనుల ను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో నరమేదాన్ని అంతర్ యుద్ధాన్ని చేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ ను తక్షణమే కేంద్ర ప్రభుత్వం నిలిపి వేసి ఇప్పటి వరకు పారామిలటరీ బలగాలు చేసిన ఎన్కౌంటర్ ల పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. పాకిస్తాన్ తో యుద్ధాన్ని నిలిపి వేసిన కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్య వాదానికి లొంగిపోయిన ప్రధాని మోదీ, హెూంమంత్రి అమిత్ షా లు స్వదేశీ పౌరుల ను ఎన్కౌంటర్ల పేరుతో కాల్చి చంపడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఆపరేషన్ కగార్ తో ఇప్పటి వరకు పారా మిలటరీ బలగాలు ఎన్కౌంటర్ ల పేరుతో మావోయిస్ట్ లను ఆదివాసి ప్రజలను కాల్చి చంపిన సంఘటనలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి తో న్యాయ విచారణ జరిపించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సభలో ప్రముఖ రచయిత అల్లం రాజయ్య, విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలసాని రాజయ్య, సీబీ సీఐ డీ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్, కటకం సుదర్శన్ సోదరులు కటకం రఘు, కటకం కమలాకర్ లతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ మత్త మారి సూరిబాబు, పౌర హక్కుల సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులు పుల్ల సుచరిత,శ్రీపతి రాజగోపాల్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముడి మడుగుల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముచ్చర్ల మల్లయ్య, చిలుముల శంకర్, నాతరి స్వామి, రిటైర్డ్ టీచర్ మహ్మద్ ఇబ్రహీం ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవి విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉండాలి- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే 31, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి జిల్లా పోలీసు యంత్రాంగం ఎంతగానో సేవలందించిందని అందులో భాగంగానే జిల్లా పోలీసు వ్యవస్థలు 42 సంవత్సరముల పాటు సుదీర్ఘకాలంగా సేవలందించి,జిల్లా లో సంఘవిద్రోవశక్తులతో పోరాడి జిల్లా ప్రజలకు శాంతి భద్రత రక్షణలో తన వంతు పాత్ర పోషించిన ఇద్దరు ఏ ఆర్ ఎస్ ఐ లు పదవి విరమణ పొందుతున్న సందర్భంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు కార్యాలయాలో కుటుంబ సభ్యులతో ఆహ్వానించి పదవి విరమణ పొందుతున్న అధికారులను శాలువా పూలమాలలతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు.పదవి విరమణ పొందుతున్న పి భీమ్ రావు ఎఆర్ఎస్ఐ, జె గౌరయ్య ఎఆర్ఎస్ఐ లను సన్మానించారు.సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, వ్యాయామం చేస్తూ ఉండాలని తెలిపారు. జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి మీలాంటి పోలీసు అధికారులు చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. దాదాపు 42 సంవత్సరముల పాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవి విరమణ పొందుతున్న అధికారులను జిల్లా ఎస్పీ చేసిన సేవలను కొనియాడి, అభినందించారు.ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగమధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది కుటుంబ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో 26 వేల 164 మంది రైతుల ఖాతాలలో 282 కోట్ల రూపాయల జమ - జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల,31 మే, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 26 వేల 164 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 83 వేల 977 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 282 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 264 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు,



పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 21 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**బేల, మే 31, సూర్య మేజర్ న్యూస్ :**

అరులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ



లక్ష్యమని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి అన్నారు. మండలంలోని సాంగిడి గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి 35 ఇళ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా రూపేష్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యే విధంగా ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రత్యేక అధికారి ఏ ఈ వినోద్, పంచాయతీ కార్యదర్శి గౌతమ్, నాయకులు నర్సారెడ్డి, దయాకర్, లస్మన్న, వినోద్, సుధాకర్, నవనీత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యాన్ని ఇతరులకు అమ్మితే రేషన్ కార్డులు రద్దు - ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డి

**జన్నారం, మే 31, సూర్య మేజర్ న్యూస్ :** రేషన్ బియ్యాన్ని ఇతరులకు అమ్మితే అమ్మిన వారి రేషన్ కార్డును రద్దు చేయడం జరుగుతుందని, కొన్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల నుంచి మూడు నెలలకు




సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు ఈ బియ్యాన్ని వాడుకోవాలని, ఇతరులకు అమ్మి ఇబ్బందులు పడవద్దు అన్నారు. ఎవరైనా దొంగచాటుగా బియ్యాన్ని అమ్మినట్లయితే వారి సమాచారాన్ని నేరుగా గాని, ఫోన్లో గాని తెలియజేయాలని వారిపై క్షుణ్ణంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## నకిలీ విత్తనాలు పట్టివేత. ఒకరిపై కేసు నమోదు

**తలమడుగు మే 31 సూర్య మేజర్ న్యూస్:** నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాధిక అన్నారు. తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన జక్కుల వెంకన్న దగ్గర 25 నకిలీ విత్తన ప్యాకెట్లను టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో సీజ్ చేయడం జరిగింది. ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు ఇకముందు కూడా ఎవరు ఇలాంటి నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే చట్ట ప్రకారం కాటిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై తో పాటు మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, ఆర్ ఐ రోహిదాస్, ఏఈఓ లు రమేష్,సతీష్ లు టాస్క్ ఫోర్స్ టీం అధికారులు ఉన్నారు.



## హాస్పిటల్ కు తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవం

**కడెం,మే 31, సూర్య మేజర్ న్యూస్ :**



నిండు గర్భిణిని హాస్పిటల్ కు తరలిస్తుండగా అంబులెన్స్ లో పాపకు జన్మనివ్వడం జరిగింది. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపెల్లి బాబా నాయక్ తండాకు చెందిన జాదవ్ శ్రీలతకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి, అంబులెన్సులో కడెం ప్రభుత్వాసుపత్రికి వస్తుండగా, గండి పోచమ్మ గుడి వరకు వచ్చిన సమయంలో శ్రీ పురిటి నొప్పులు ఎక్కువ అవ్వడంతో అంబులెన్స్ లోనే పాపకి జన్మనివ్వడం జరిగింది. అనంతరం వారిని కడెం ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువచ్చి చూడగా తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

## జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు

**వాంకిడి మే 31,సూర్య మేజర్ న్యూస్**

జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు మండల వ్యాప్తంగా 'భూభారతి' చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డి. కవిత తలిపారు. గ్రామపంచాయతీల వారిగా సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రైతులు తమ భూ సమస్యలను సదస్సులో పరిష్కరించుకోవాలని అన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి - ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**సారంగాపూర్,జూన్ 1,సూర్య మేజర్ న్యూస్**

కొనుగోలు కేంద్రాలలో జాప్యం చేయకుండా ధాన్యం కొనుగోలు ను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.మండలంలోని తాంద్ర,వైకుంఠ పూర్,కంకేట,మలక్ చించోలి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని,తడిసిన ధాన్యాన్ని ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని కొన్ని కొనుగోలు కేంద్రాలలో లారీల వారు డబ్బులు తీసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని రైతులు ఎవరు కూడా లారీలకు డబ్బులు ఇవ్వద్దని ఆయన కోరారు.వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండు రోజుల్లోగా కొనుగోలు మొత్తం పూర్తి అయ్యేలా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు అధికారులకు ఆయన ఆదేశించారు.ఆయన వెంట సారంగాపూర్ మండల బిజెపి అధ్యక్షులు కాల్వ నరేష్, నాయకులు సాహెబ్ రావు,రాజు,గంగా రెడ్డి,నర్సయ్య,చెన్న రాజేశ్వర్,సాగర్ రెడ్డి,విలాస్,తిరుమల చారి,భూమేష్,నవీన్,అధికారులు తదితరులు ఉన్నారు.



# పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం

## – జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్




**లక్షెట్టిపేట, మే 31, సూర్య మేజర్ న్యూస్:** పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం అని, యువత చెడు వ్యసనాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ అన్నారు. శనివారం వరల్డ్ యాంటీ టొబాకో డే సందర్భంగా కోర్టు ఉద్యోగులతో ప్రమాణం చేయించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు జీవితాలను నాశనం చేస్తుందన్నారు. పొగాకు వ్యసనానికి గురైతే అది క్యాన్సర్ కు దారి తీస్తుందని, తద్వారా ఆర్థికంగా శారీరకంగా నష్టపోతామని ఆయన వివరించారు. అనంతరం మోదేల గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమని క్షణికావేశంతో చేసిన తప్పులను సరిదిద్దుకొని కోర్టు కేసుల నుండి విముక్తి పొందాలన్నారు. జూన్ 14న ఏర్పాటు చేయనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొమిరెడ్డి సత్తన్న, జనరల్ సెక్రటరీ ప్రదీప్ కుమార్,న్యాయవాదులు సత్యం, రాజేశ్వరరావు, అక్కల శ్రీధర్, రవీందర్, పద్మ, రెడ్డి మల్ల ప్రకాశం,ఎప్పి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణాను అడ్డుకుంటున్న హిందూ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

**కాగజ్నగర్ ,మే 31, సూర్య మేజర్ న్యూస్:** వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న ఆవులను రక్షించకుండా అక్రమ సంపాదనకు అలవాటుపడ్డ అధికారులు గోవదను ప్రోత్సహిస్తూ అక్రమ గోరవాణాను అడ్డుకున్న హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్న పోలీసులు. ఈరోజు శనివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలో ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిలోనికి చొరబడి శివ గౌడ్, అరుణ్ లోయ, సమీర్ గుప్తా, లాయర్ విజయ్ కుమార్, తదితర కార్యకర్త లను అరెస్ట్ చేయడం జరిగింది. ఈ మూగజీవాల అక్రమ రవాణాను ప్రోత్సహించే సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు చెల్లిస్తూ తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని, అరెస్ట్ అయిన బజరంగ్దళ్ కార్యకర్తలు అన్నారు. ఎలాంటి చట్టప్రకారమైన ముందస్తు హెచ్చరికలు లేకుండా తమను అరెస్టు చేయడం అన్యాయమని తమ ఆదాయానికి అడ్డం వస్తున్నారు అనే కారణంతోనే మమ్మల్ని అరెస్టు చేశారని బజరంగ్దళ్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు శివ గౌడ్ ఆరోపించారు.






## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**రామకృష్ణాపూర్, మే 31, సూర్య మేజర్ న్యూస్:** క్యాతనపల్లి మున్సిపాలిటీలోని ఏడవ వార్డు ప్రభుత్వ పాఠశాలలో



గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సంస్థ వారు నిర్వహించే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించిన ఏడవ వార్డు మాజీ కౌన్సిలర్ పోలం సత్యం ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సంధ్య శిక్షణ కేంద్ర నిర్వాహకురాలు సంధ్య రాణి కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల సత్యం, ఆర్పీలు కోమల. రజిత. శ్యామల మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

### – టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుండారపు చక్రపాణి

**లక్షెట్టిపేట, మే 31, సూర్య మేజర్ న్యూస్ :** ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు లక్షెట్టిపేట మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ




పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు , ఆటస్థలం ఉన్నాయన్నారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ అందిస్తున్నారని తెలిపారు. ఈ ప్రచారంలో జిల్లా అధ్యక్షులు జి చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి రాజావేణు, జిల్లా ఉపాధ్యక్షులు వి కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శులు కే చంద్రమౌళి, జి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు కుల బాంధవులకు ఆహ్వానం

**రామకృష్ణాపూర్, మే 31, సూర్య మేజర్ న్యూస్:** క్యాతనపల్లి మున్సిపాలిటీలోని మున్నూరుకాపు సంఘం జూన్ 1వ తేదీ ఆదివారం స్థానిక ఎస్ఆర్కే స్కూల్ ఆవరణలో మున్నూరు కాపు మండల అధ్యక్షులు రామిడి కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు, ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం నూతన కమిటీ ఎన్నుకోవడం అదేవిధంగా రామకృష్ణాపూర్ మున్నూరు కాపు సంఘం బలోపేతం చేయడం కొరకు అంతేకాకుండా నూతన భవనం ఏర్పాటు చేయడం విషయంలో చర్చించడం జరుగుతుంది. కావున మున్నూరుకాపు కుల బాంధవులు,పాత కమిటీ సభ్యులు,యువత,మహిళలు పెద్ద ఎత్తున హాజరయి సమావేశాన్ని విజయవంతం చేయగలరని పత్రికా ప్రకరణ ద్వారా తెలిపారు.

## భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

### – ఎమ్మార్వో దిలీప్ కుమార్

**లక్షెట్టిపేట, మే 31, సూర్య మేజర్ న్యూస్ :** మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో జూన్ 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏ దిలీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఆర్ చట్టం ఉద్దేశించి ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.



మండల రెవెన్యూ అధికారులు రెండు టీములుగా ప్రతిరోజు రెండు గ్రామాల చొప్పున ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. మొదటి టీంకు తహసిల్దార్ దిలీప్ కుమార్, రెండవ టీంకు డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి టీం లీడర్లుగా వ్యవహరిస్తారని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో ఇది వరకు దరఖాస్తు చేసిన భూ భారతిలో, ఆన్లైన్లో పెండింగ్ ఉన్నవాళ్ళు కాకుండా మిగితా వాళ్ళు, కొత్త పట్టదారు పాసుబుక్ రానివాళ్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, రైతులు భూభారతి సమస్యలను రాతపూర్వకంగా కమిటీలకు తెలియజేయాలని సూచించారు.

### తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా

## న్యూవెల్మల్ వాసి అంకం జయప్రకాష్

**సోన్, మే 31 సూర్య మేజర్ న్యూస్:** తెలంగాణ చరిత్ర పరిశోధనలో ముఖ్య భూమిక పోషిస్తున్న తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ కు న్యూవెల్మల్ గ్రామస్తుడు అంకం జయప్రకాశ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తెలంగాణ చరిత్ర పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వడం, చారిత్రక విశ్లేషణకు మార్గనిర్దేశం చేయడం, మరియు చరిత్ర రచనలోని వాస్తవాలను పరిరక్షించడం వంటి విషయాలలో తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ కృషి చేస్తుంది.తెలంగాణ చరిత్రపై శాస్త్రీయ పరిశోధనను ప్రోత్సహిస్తూ, చరిత్ర రచనను వాస్తవ ఆధారంగా కొనసాగించడం చరిత్ర కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం.అంతేకాకుండా తెలంగాణలోని భిన్న మతాలు, జాతులు, సామాజిక వర్గాల చరిత్రను సమానంగా ప్రాధాన్యతతో పరిశీలిస్తూ,



చరిత్ర రచనలో వక్రీకరణను నిరోధించడం చరిత కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. అదేసమయంలో చరిత్రను ప్రజలకు సరళంగా అందుబాటులోకి తేవడానికి కూడా టిహెచ్ సి కృషి చేస్తుంది. ప్రతీ సంవత్సరం రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో, కళాశాలలో సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో పరిశోధకులు తమ పరిశోధన పత్రాలు సమర్పిస్తారు. భారతదేశంలోని ప్రముఖమైన చరిత్రకారుల సంఘమైన ఈ కాంగ్రెస్ కు ప్రధాన కార్యదర్శిగా అంకం జయప్రకాశ్ నియమితులు కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్కే 6 ఇంక్లైన్ డీజీఎం తిరుపతికి ఘన సన్మానం

**శ్రీరాంపూర్, మే 31, సూర్య మేజర్ న్యూస్:** శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆర్కే 6 ఇంక్లైన్ డీజీఎం ఇ. తిరుపతి శనివారం 31 మే 2025 తమ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా, ఐ.ఎన్.టి.యు.సి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి ఏరియా వైస్



ప్రెసిడెంట్ శ్రీరాంపూర్ ఏరియా జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ.. తిరుపతి నాయకత్వ పటిమను కొనియాడారు. శంకర్ రావు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో తిరుపతి సారథ్యంలో ఆర్.కే.6 ఇంక్లైన్ తమ లక్ష్యాన్ని 18 రోజుల ముందుగానే సాధించిందని తెలిపారు. ఇది ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి, అంకితభావానికి నిదర్శనమన్నారు. అంతేకాకుండా గని ఆధునీకీకరణ పనులలో ఆయన కృషి ఎంతో ఉందని, 2024 సంవత్సరంలో జీరో యాక్సిడెంట్ కేసులను నమోదు చేయడంలో ఆయన పాత్ర కీలకమని శంకర్ రావు గారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. తిరుపతి సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన భవిష్యత్ జీవితం ఆనందమయంగా ఉండాలని ఐ.ఎన్.టి.యు.సి నాయకులు, కార్మికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐ.ఎన్.టి.యు.సి నాయకులు గరిగే స్వామి, తిరుపతి రాజు, కలవేన శ్యామ, భీమ్ రవి, ఇ. సంతోష్ కుమార్, జి. మహేష్, పిట్ సెక్రటరీ ఎలుపుల ప్రవీణ్ పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకలకు హాజరైన నూతన దంపతులను దీవించిన

### – ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ మే 31 సూర్య మేజర్ న్యూస్:** మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన పొన్నాల పోత రెడ్డి కుమారుడు సృజన్ రెడ్డి ఏ లేటి విలాస్ రెడ్డి కూతురు హర్షిత నిశ్చితార్థానికి, అలాగే బాదల పోతా రెడ్డి కుమార్తె శృతి నిశ్చితార్థాలకు వెళ్లి నూతన వధూవరులను దీవించారు. ఎమ్మెల్యే వెంట ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, దివాకర్ రెడ్డి, సురేందర్ యాదవ్ పలువురు గ్రామస్తులు తదితరులు ఉన్నారు



## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం-క్రీడా దుస్తుల పంపిణి

**రెబ్బెన, మే31, సూర్య మేజర్ న్యూస్:**
బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిభిరం ముగుంపు వేడుకలను శుక్రవారం గోలేటి లోని శ్రీ భీమన్న మైదానం లో



నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరైన జిఎం ఎం.విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ. చిన్నారులు ఆసక్తి ఉన్న ఆటలో నైపుణ్యాన్ని పెంచుకుని జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలన్నారు. చిన్నారులకు క్రీడా దుస్తులను పంపిణి చేశారు.అనంతరం భీమన్న క్రీడా మైదానం లో జూన్ 2 వ తేదీన జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సంబందించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దిశ నిర్దేశం చేశారు ఈ కార్యక్రమం లో ఏఐటియుసి నాయకులు మారం శ్రీనివాస్ , ఖైరిగూర పిఓ ఎం నరేందర్ , ఎస్ ఓ టు జి ఎం కె.రాజమల్లు, డీజీఎం(సివిల్) బాషా, ఏరియా ఇంజనీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డివైపిఎం వేణు సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్ మరియు స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ కిరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన
### - ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**సోన్, మే 31 సూర్య మేజర్ న్యూస్:**
మండలం లోని కడ్తాల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో



తడిసిన వరి ధాన్యంను సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, వర్షాకాలం ప్రారంభం అవుతున్న సందర్భంగా వరిధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయరాదని, త్వర త్వరగా కొనుగోలు చేసి లారీలలో రైస్ మిల్లర్లకు తరలించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, హరీష్ రెడ్డి, రాజానర్సయ్య, సుంచు సవీన్, మద్దెల గంగాధర్, గుర్రం నారాయణ, దినేష్ తదితరులు ఉన్నారు.

## యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**మందమర్రి, మే 31, సూర్య మేజర్ న్యూస్:**
పెద్దపల్లి జిల్లా మంథనిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (జేఎన్టీయూహెచ్) లో ప్రవేశానికి అర్హులైన సింగరేణి ఉద్యోగుల పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు సింగరేణి యాజమాన్యం కృషి చేస్తుందని, మంథని జేఎన్టీయూ కాలేజీలో మైనింగ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లలో మూడు చొప్పున మొత్తం 36 సూపర్ న్యూమరి సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఎగ్జిక్యూటివ్ పిల్లలకు 18 సీట్లు, సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 18 సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో తెలంగాణ ఈఎపిసెట్ లో అర్హత సాధించి ఉండాలని, నిర్ణీత నమూనాలలో దరఖాస్తును సర్టిఫికెట్లతో జత చేసి జూన్ 14వ తారికులోగా జిఎం(హెచ్ ఆర్ డి) లో సమర్పించాలన్నారు, కౌన్సిలింగ్ లో ఎంపికైన విద్యార్థులు నిర్ణీత ఫీజును జేఎన్టీయూహెచ్, యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ ఇంజనీరింగ్, మంథని పేరిట బ్యాంకులో చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని సింగరేణి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

**ముధోల్,మే 31,సూర్య మేజర్ న్యూస్:**
ముధోల్ మండల తహసీల్దార్ శ్రీలత ఆదేశాల ప్రకారం ముధోల్



లోని మహాలక్మి ప్రాంతంలోని వెంకటేశ్వర సీడ్స్, పెస్టిసైడ్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అగ్రికల్చర్ అధికారి రచన మాట్లాడుతూ విత్తన విక్రయదారులు ఎక్కువ ధరలకు రైతులకు అమ్మిన,నకిలీ విత్తనాలు సరఫరా చేసిన చర్యలు తీసుకుంటామని అన్నారు.అనంతరం దుకాణాలలోని పలు రికార్డులను పరిశీలించి రైతులకు మేలైన విత్తనాలని సరఫరా చేయాలని సూచించారు.వీరితో పాటుగా మండల ఎస్సై బిట్ల పెర్సిస్,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సి.హెచ్ నారాయణ రావు పాటిల్ ఉన్నారు.

## జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ సకాలంలో అందజేయని పక్షంలో పెన్షన్ నిలిపివేత
### - పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్


**మందమర్రి, మే 31, సూర్య మేజర్ న్యూస్:**
జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ సకాలంలో అందజేయని పక్షంలో రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ జనవరి నెల నుండి నిలిపివేయడం జరుగుతుందని ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంపీఎఫ్ ద్వారా పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ప్రతి




సంవత్సరం నవంబర్ నెలలో జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ విధిగా సీఎంపీఎఫ్ వారికి అందజేయాలని తెలిపారు. ప్రతి సంవత్సరం విదిగా జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ అందజేయడం పరిపాటిగా పాటించాలని సూచించిన ఆయన సీఎంపీఎఫ్ వారు పెన్షనపంపిణీ బాధ్యత ఎస్బీఐ దన్బాద్ వారికి అప్పగించినట్లు తెలిపారు. 2023 సంవత్సరం నుండి దేశ వాప్తంగా సీఎంపీఎఫ్ పెన్షన్ పంపిణీ ఎస్బీఐ చేపట్టగా ఇటీవల చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ అందజేకపోవడం, సరైన సమాచారం లేకుండా ఇవ్వడం మూలంగా చాలా మంది పెన్షన్ పొందలేకపోతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి రిటైర్డ్ ఉద్యోగి నవంబర్ నెలలో తమకు సంబందించిన జీవన్ ప్రమాన్ సర్టిఫికెట్ మీ సేవా సెంటర్లో ఆన్లైన్ చేసి సంబంధిత ఎస్బీఐ బ్యాంకు వారికి కానీ సీఎంపీఎఫ్ వారికి అందజేయాల్సివుంటుందని తెలిపారు.

## జంజిరాల రాజన్న మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు
### - బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి.

**బెల్లంపల్లి, మే 31, సూర్య మేజర్ న్యూస్:**
జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జంజిరాల రాజన్న మృతి



కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం జంజిరాల రాజన్న మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే బాబు క్యాంపు బస్తి లోని రాజన్న ఇంటికి వెళ్ళి ఆయన భౌతిక కాయం పై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్త మారి సూరిబాబు,కాంగ్రెస్ నాయకులు చిలుముల శంకర్,నాతరి స్వామి,బండి ప్రభాకర్ యాదవ్, కంకటి శ్రీనివాస్, రేగుంట రాజలింగు,ఎలుక ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరలో అంతరాయం వాంకిడి మే 31 సూర్య మేజర్ న్యూస్ వాంకిడి: నేడు విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. 33 కేవి లైన్లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, మద్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సహకరించాలని కోరారు.

## ఏరియాలో ఉత్తమ అధికారిఉత్తమ కార్మికుడి ఎంపిక

**మందమర్రి, మే 31, సూర్య మేజర్ న్యూస్:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మందమర్రి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న వై. వెంకటరమణ (అడిషనల్ జనరల్ మేనేజర్ ఈ అండ్ ఎం), జిఎం కార్యాలయం ఉత్తమ అధికారిగా, అలాగే ఉత్తమ ఉద్యోగిగా టి సునీల్ కుమార్ (కోల్ కట్టర్) కేకే-5 లను ఎంపిక చేస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపికైన ఉత్తమ అధికారి వెంకట రమణను కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జూన్ రెండోవ తారీఖున నిర్వహించనున్న సెంట్రల్ ఫంక్షన్ లో సింగరేణి సిఅండ్ ఎండి బలరాం చేతుల మీదుగా సన్మానంతో పాటు ప్రశంసాపత్రం అందచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన టి సునీల్ కుమార్ (కోల్ కట్టర్, కేకే-5) ను పట్టణంలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో మందమర్రి ఏరియా జిఎం జి దేవేందర్ చేతుల మీదుగా సన్మానంతో పాటు ప్రశంసా పత్రం అందించనున్నట్లు యజమాన్యం ఉత్తర్వులో జారీ చేసింది. ఉత్తమ అధికారి, కార్మికునిగా ఎంపికైన వారిని ఏరియా అధికారులు కార్మికులు అభినందనలతో ముంచెత్తారు.

## కవిత పర్యటన కు దివాకర్ రావు దూరం.

**మంచిర్యాల టౌన్, మే 31,సూర్య మేజర్ న్యూస్ :** బి ఆర్ ఎస్ పార్టీ లో నాలుగు స్థంబాలు గా చెప్పుకుంటారు.కెసిఆర్, కె టి ఆర్,హరీష్ రావు,కవిత.బి ఆర్ ఎస్ నాయకులు వీరిని తమ అధిష్టానం గానే పరిగనిస్తారు.ఈ నలుగురులో కె సి ఆర్ తప్ప మిగిలిన ముగ్గురు ఎవరికీ వారు స్ట్రాంగ్ లీడర్లే.వారికంటూ బిఆర్ఎస్లో స్వంత ప్యానెల్ ఏరుపార్చుకున్నారు. వారిని కలవడానికి ప్రతి బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్త ఎదురుచూస్తుంటారు.ఎవరైనా ఏదైనా నియోజకవర్గం కు పర్యటిస్తే, స్థానిక నియోజకవర్గ బి ఆర్ ఎస్ నాయకులు,కార్యకర్తలు మాములు హడావిడి చేయరు.ఏ నియోజకవర్గం మొత్తం ఫ్లెక్సీ తో స్వాగతం పలుకుతారు. వారి కార్యక్రమం లు అయిపోయేవరకు వారితో ఉంటారు. కానీ శుక్రవారం కల్వకుంట్ల కవిత మంచిర్యాల లో పాలుగోన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎక్కడ కనిపించలేదు. కవిత శ్రీరాంపూర్, నస్పూర్ లో కార్యకర్తలు ఇల్లలో కి వెల్లి కార్యకర్తలు తో ముచటించారు.మంచిర్యాల పట్టణం లో ఒక పెల్లి వేడుకలు లో పాలుగొని, సీనియర్ రిపోర్టర్ మునీర్ కుటుంబ సభ్యులు ను పరామర్శించారు.అనంతరం మీడియా తో మాట్లాడారు. దాదాపు 5గంటల పాటు మంచిర్యాల లో ఉన్న కవిత ను మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కలవలేదు.గతం లోమంచిర్యాల కవిత వస్తే సకల మర్యాద లు చేసిన దివాకర్ రావు ఇపుడు కనీసం మర్యాద పూర్వకంగా కాల్వకపోవడం ఏంటి అని చేర్చ జరుగుతుంది.

## ఉద్యోగుల సమస్యలు పై మంత్రి సీతక్క కు వినతి పత్రం ఇచ్చిన టీ ఎన్ జీ ఓ నాయకులు

**మంచిర్యాల టౌన్,మే 31, సూర్య మేజర్ న్యూస్:** మంచిర్యాల జిల్లా కాలేక్టరేట్లో శనివారం పంచాయతీ రాజ్ శాఖామాత్యులు మంచిర్యాల జిల్లా ఇంఛార్జి మంత్రి దనసరి అనసూయ మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలు వివరించిన మంచిర్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షకార్యదర్శులు గడియారం శ్రీహరి,భూముల రాంమోహన్,టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య,టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపూరావు.

## సీఎం, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం

**జన్నారం, మే 31, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలం పొనకల్ నుండి పుట్టి గుడా, బాదంపల్లి వెళ్లే మార్గంలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి నిర్మాణానికి 1 కోటి 54 లక్షలు మంజూరు చేయించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ శనివారం ఆ బ్రిడ్జి వద్ద ఆయా గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందని, మునుముందు రోజుల్లో ఎమ్మెల్యేకు సహాయ సహకారాలు అందించాలని ఆయా గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు సయ్యద్ ఇసాక్, కస్తూరి భూమన్న, దాముఖ కరుణాకర్, బెడద సత్తయ్య, పాదం రాకేష్, నాయిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

